కర్నాటక పాంచ్ పటాకా

ఐదోసారి విజయ్ హజారే ట్రోఫీ కైవసం ● ఫైనల్లో విదర్భపై అద్భుత విజయం

వడోదరా: విజయ్ హజారే వన్డే టోర్నీని కర్నాటక రికార్డు స్థాయిలో ఐదోసారి కైవసం చేసుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో కర్నాటక 36 పరుగుల తేడాతో విదర్భపై అద్భుత విజయం సాధించింది. కర్నాటక నిర్దేశించిన 349 పరుగుల లక్ష్యఛేదనలో విదర్భ 48.2 ఓవర్లలో 312 పరుగులకు పరిమితమైంది. ఓపెనర్ ధృవ్‌షోరె(110) హ్యాట్రిక్ సెంచరీతో కదంతొక్కగా, సూపర్‌ఫామ్‌లో ఉన్న కెప్టెన్ కరణ్‌నాయర్(27) ఫైనల్లో నిరాశపరిచాడు. కౌశిక్(3/47), ప్రసిద్ధ్ కృష్ణ(3/84), అభిలాష్(3/58) ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయిన విదర్భ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ఆఖర్లో హర్ష్‌దూబే(63) రాణించినా జట్టును గెలిపించలేకపోయాడు. తొలుత స్మరణ్(101) సెంచరీతో కర్నాటక 50 ఓవర్లలో 348/6 స్కోరు చేసింది. క్రిష్ణన్(78), మనోహర్(79) అర్ధసెంచరీలతో కదంతొక్కా రు. స్మరణ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', కరణ్‌నాయర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కాయి.

సాత్విక్ జోడీ నిష్క్రమణ

న్యూఢిల్లీ: ఇండియన్ ఓపెన్ సూపర్-750 టోర్నీలో భారత ప్రస్థానం ముగిసింది. టైటిల్‌పై ఆశలు రేపిన భారత స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి పోరాటానికి సెమీఫైనల్లోనే చుక్కెదురైంది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 18-21, 14-21తో గో జి ఫి-నూర్ ఇజుద్దీన్(మలేషియా) ద్వయం చేతిలో ఓటమిపాలైంది. దాదాపు 40 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఏడో సీడ్ సాత్విక్, చిరాగ్ జంట తొలి గేమ్‌లో మాత్రమే ఒకింత దీటైన పోటీనిచ్చింది. అయితే కీలకమైన రెండో గేమ్‌లో ప్రత్యర్థికి సవాలు విసిరేందుకు ప్రయత్నించినా లాభం లేకపోయింది. మెరుపు లాంటి స్మాష్‌లకు తోడు సుదీర్ఘమైన ర్యాలీలతో మలేషియా జోడీ కీలక పాయింట్లు ఖాతాలో వేసుకుని మ్యాచ్‌ను తమ వశం చేసుకుంది.

క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ భరోసా

కార్యదర్శి దేవజిత్‌తో జగన్ భేటీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ సహకరించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు..బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియాను కోరారు. శనివారం ముంబైలోని బీసీసీఐ కార్యాలయంలో దేవజిత్‌తో పాటు సీఈవో హేమాంగ్ అమిన్‌తో జగన్, హెచ్‌సీఏ కోశాధికారి సీజే శ్రీనివాస్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాల్లో కొత్తగా నిర్మించే స్టేడియాలు, మౌలిక సదుపాయాల కల్పనకు బోర్డు తోడ్పాటు అందించాలని జగన్ విజ్ఞప్తి చేయగా, అందుకు దేవజిత్ సానుకూలంగా స్పందించారు. హెచ్‌సీఏ చేపట్టే అభివృద్ధి పనులకు 50శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ దృష్ట్యా ఐపీఎల్ లీగ్ మ్యాచ్‌లతో పాటు ప్లేఆఫ్స్ కేటాయించాలని కోరారు.

బుమ్రాకు బెర్తు

హైదరాబాదీ సిరాజ్‌కు చుక్కెదురు

షమీ రీఎంట్రీ, గిల్‌కు వైస్ కెప్టెన్సీ ● ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్, చాంపియన్స్ ట్రోఫీకి జట్టు ఎంపిక

ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు ఎంపికపై ఉత్కంఠకు తెరపడింది. ఇటీవలి పేలవ ప్రదర్శనకు చెక్ పెడుతూ అనూహ్య మార్పులకు ఆస్కారం ఉంటుందనుకున్న అభిమానులకు నిరాశే ఎదురైంది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీకి పెద్దగా మార్పులేమి లేకుండానే బీసీసీఐ జట్టును ఎంపిక చేసింది. గాయంతో ఇబ్బంది పడుతున్న బుమ్రాకు బెర్తు ఇచ్చిన సెలెక్టర్లు హైదరాబాదీ సిరాజ్‌కు మొండిచేయి చూపారు. రోహిత్‌శర్మకు డిప్యూటీగా గిల్‌కు చాన్స్ దొరకగా, గాయం నుంచి తేరుకున్న షమీ రీఎంట్రీ ఇచ్చాడు. అర్ష్‌దీప్‌సింగ్ వన్డేల్లోకి రాగా, ఆల్‌రౌండర్లకు పెద్దపీట వేశారు. ప్రక్షాళన అంటూ గప్పాలకు పోయిన బీసీసీఐ అనుభవానికే మొగ్గుచూపింది.

ముంబై: స్వదేశంలో ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్, పాకిస్థాన్ వేదికగా వచ్చే నెలలో జరిగే ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ కోసం బీసీసీఐ శనివారం భారత జట్టును ప్రకటించింది. అనూహ్య మార్పులేమి లేకుండా 16 మందితో కూడిన జట్టును ఎంపిక చేసింది. బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెలెక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగర్కార్, కెప్టెన్ రోహిత్‌శర్మ జట్టు ప్రకటిస్తూ పలు అంశాలపై మాట్లాడారు. ఇటీవలి ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో గాయపడ్డ స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఎంపిక చేసిన సెలెక్టర్లు నిలకడగా రాణిస్తున్న హైదరాబాదీ స్పీడ్‌స్టర్ సిరాజ్‌కు మొండిచేయి చూపారు. గాయం నుంచి తేరుకున్న సీనియర్ పేసర్ షమీ..దాదాపు 14 నెలల తర్వాత తిరిగి జట్టులో చోటు దక్కించుకున్నాడు. చైనామన్ స్పిన్నర్ కుల్దీప్‌యాదవ్‌కు చోటు లభించింది. ఇక టీ20ల్లో మెరుగ్గా రాణిస్తున్న లెఫ్టార్మ్ పేసర్ అర్ష్‌దీప్‌సింగ్‌కు సెలెక్టర్లు వన్డేల్లో అవకాశం కల్పించారు. దుబాయ్‌లో పిచ్ పరిస్థితులను అంచనా వేస్తూ సెలెక్టర్లు ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. రోహిత్‌శర్మకు డిప్యూటీగా శుభమన్ గిల్‌కు వైస్‌కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించిన సెలెక్టర్లు ఆల్‌రౌండర్లకు పెద్దపీట వేశారు. హార్దిక్ పాండ్యాకు తోడు అక్షర్‌పటేల్, వాషింగ్టన్ సుందర్, జడేజాకు అవకాశం కల్పించారు. ఫస్ట్ చాయిస్ వికెట్‌కీపర్‌గా రిషబ్ పంత్ చోటు దక్కించుకోగా, రిజర్వ్‌గా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. యువ పేసర్ హర్షిత్‌రానాను కేవలం ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక చేశారు.

ఫిట్‌నెస్ ఉంటేనే: బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లో గాయపడ్డ బుమ్రా ప్రస్తుతం జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)లో పునరావాసం పొందుతున్నాడు. వచ్చే నెల 19వ తేదీ నాటికి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తేనే బుమ్రాకు జట్టులో చోటు ఉంటుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. ఒకవేళ అప్పటికి బుమ్రా ఫిట్‌నెస్ సాధించకపోతే అతని స్థానంలో పేస్ ఆల్‌రౌండర్‌గా నితీశ్‌కుమార్‌రెడ్డి చోటు దక్కించుకునే అవకాశముంది. ఇదిలా ఉంటే బోర్డర్-గవాస్కర్ సిరీస్‌లోబుమ్రా జతగా అదరగొట్టిన సిరాజ్‌ను సెలెక్టర్లు పక్కకు పెట్టారు. దీనిపై రోహిత్‌ను ప్రశ్నించగా, జట్టులో సమతూకం కోసం సిరాజ్‌ను దురదృష్టవశాత్తు ఎంపిక చేయలేకపోయామని సమాధానమిచ్చాడు. చాంపియన్స్ ట్రోఫీలో కేవలం ముగ్గురు పేసర్లకు పరిమితమయ్యామని పేర్కొన్నాడు. సిరాజ్ లేకపోవడం లోటైనా మాకు ఆప్షన్స్ లేవని అన్నాడు. ఇక ఫార్మాట్‌తో సంబంధం లేకుండా రాణిస్తున్న జైస్వాల్‌ను వన్డేల్లోకి తీసుకున్నామని వివరించాడు. ఇదిలా ఉంటే విజయ్ హజారేలో పరుగుల వరద పారించిన కరణ్ నాయర్‌ను సెలెక్టర్లు కనీసం పరిగణనలోకి తీసుకోలేకపోయారు.

భారత జట్టు: రోహిత్(కెప్టెన్), గిల్(వైస్ కెప్టెన్), కోహ్లీ, శ్రేయాస్, రాహుల్, హార్దిక్, అక్షర్, సుందర్, కుల్దీప్, బుమ్రా, షమీ, అర్ష్‌దీప్, జైస్వాల్, పంత్, జడేజా, రానా (ఇంగ్లండ్ సిరీస్‌కు)

ఐటీఎఫ్ విజేత అంకిత జోడీ

న్యూఢిల్లీ: ఐటీఎఫ్ డబ్ల్యూ50 ఈవెంట్‌లో భారత టెన్నిస్ స్టార్ అంకితా రైనా అదరగొట్టింది. శనివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో అంకిత, నైత బేన్స్(బ్రిటన్)జోడీ విజేతగా నిలిచింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన తుదిపోరులో అంకిత, బేన్స్ ద్వయం 6-4, 3-6, 10-8తో నాలుగో సీడ్ అమెరికా జంట జెస్సీ అనె, జెస్సికా ఫైలాపై అద్భుత విజయం సాధించింది. గంటా 42నిమిషాల పాటు జరిగిన పోరులో తొలి సెట్‌ను కైవసం చేసుకున్న భారత్, బ్రిటన్ జోడీకి రెండో సెట్‌లో చుక్కెదురైంది. అయితే నిర్ణయాత్మక మూడో సెట్‌ను టైబ్రేక్‌లో గెలిచి మ్యాచ్‌ను తమ వశం చేసుకుంది.

ఎస్‌డీఎఫ్‌సీ అదుర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో తొమ్మిదో రౌండ్ పోరులో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ(ఎస్‌డీఎఫ్‌సీ) దుమ్మురేపుతున్నది. శనివారం ఆఖరి నిమిషం వరకు ఎస్‌డీఎఫ్‌సీ మధ్య షిల్లాంగ్ లాజాంగ్ ఎఫ్‌సీతో మధ్య హోరాహోరీగా సాగిన పోరు 5-5తో డ్రాగా ముగిసింది. శ్రీనిధి తరఫున కాస్టెండా(11ని, 16ని) , గాబ్రియెల్(71ని), విలియమ్ అల్వెస్(82ని), మానస్ దూబే(90+7ని) సాజిద్(90+8ని) గోల్స్ చేశారు.

ఫైనల్లో భారత్

ఖో ఖో ప్రపంచకప్

న్యూఢిల్లీ: అరంగేట్రం ఖోఖో ప్రపంచకప్‌లో ఆతిథ్య భారత్ అదరగొడుతున్నది. గ్రామీణ క్రీడలో తమకు తిరుగులేదని చాటిచెబుతూ మెగాటోర్నీలో భారత పురుషుల, మహిళల జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. శనివారం జరిగిన వేర్వేరు సెమీస్ మ్యాచ్‌లో మన జట్లు దుమ్మురేపాయి. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పురుషుల సెమీస్‌లో భారత్ 62-42తో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. పాయింట్ల కోసం ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తొలి టర్న్‌లో ప్రతీక్ వైకర్, ఆదిత్య గన్పులెను దక్షిణాఫ్రికన్లు సమర్థంగా నిలువరించగా, రెండో బ్యాచ్‌లో వచ్చిన అనికేత్ పోతె సఫారీలను రెండున్నర నిమిషాల పాటు అడ్డుకున్నాడు. రెండో టర్న్‌లో నిఖిల్, ఆదిత్య, గౌతమ్ రాణించడంతో భారత్ 24-20 ఆధిక్యం కనబరిచింది. కీలకమైన మూడో టర్న్‌లో రామ్‌జీ కశ్యప్, పబనీ సబర్, సుయాశ్ రాణించడంతో టీమ్‌ఇండియా గెలుపు ఖరారైంది. మరోవైపు aమహిళల సెమీస్‌లో భారత్ 66-16తో దక్షిణాఫ్రికాను చిత్తు చేసింది. ఆదివారం జరిగే ఫైనల్లో నేపాల్‌తో భారత్ తలపడుతుంది.

స్వియాటెక్ జోరు



మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పోలండ్ భామ ఇగా స్వియాటెక్ జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్ పోరులో రెండో సీడ్ స్వియాటెక్ 6-1, 6-0తో ఎమ్మా రదుకాన్(బ్రిటన్)పై అలవోక విజయం సాధించింది. గంటా 10 నిమిషాల పాటు జరిగిన పోరులో స్వియాటెక్ కండ్లు చెదిరే షాట్లతో చెలరేగింది. బలమైన ఫోర్‌హ్యాండ్, బ్యాక్‌హ్యాండ్ షాట్లకు తోడు దీటైన సర్వ్‌లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. మ్యాచ్ మొత్తమ్మీద స్వియాటెక్ రెండు ఏస్‌లు, మూడు డబుల్ ఫాల్ట్స్, 24 విన్నర్లు కొట్టింది. 12సార్లు అవనసర తప్పిదాలు చేయగా, 12 బ్రేక్ పాయింట్లలో ఐదింటిని కాపాడుకుంది. మిగతా మ్యాచ్‌ల్లో నవారో 6-4, 3-6, 6-4తో జుబేర్‌పై, రిబకినా 6-3, 6-4తో డయానా యస్ట్రేమస్కాపై, స్వితోలినా2-6, 6-4, 6-0తో పొలినిపై, మాడిసన్ కీస్ 6-4, 6-4తో కొలిన్స్‌పై, కసాట్కినా 7-5, 6-1తో పుతినెత్సెవాపై గెలిచి ముందంజ వేశారు. పురుషుల విభాగంలో టేలర్ ఫ్రిట్జ్ 6-3, 5-7, 6-7(1/7), 4-6తో మోన్‌ఫిల్స్ చేతిలో ఓడిపోయాడు. జానిక్ సిన్నర్ 6-3, 6-4, 6-2తో గిరోన్‌పై గెలిచాడు.

వాణిజ్య

ప్రపంచంలో తొలి సీఎన్‌జీ స్కూటర్

న్యూఢిల్లీ, జనవరి 18: ప్రపంచంలో తొలి సీఎన్‌జీ స్కూటర్ అందుబాటులోకి రాబోతున్నది. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టీవీఎస్..జూపిటర్ సీఎన్‌జీ మాడల్‌ను ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించింది. జూపిటర్ 125 సీఎన్‌జీ పేరుతో పిలవబడే ఈ స్కూటర్ కిలో సీఎన్‌జీకి 84 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. సీఎన్‌జీ ట్యాంక్‌తో పాటు రెండు లీటర్ల పెట్రోల్ ట్యాంక్‌తో ఈ స్కూటర్‌ను తీర్చిదిద్దింది. 124.8 సీసీ సామర్థ్యంతో రూపొందించిన ఈ స్కూటర్ గంటకు 80 కిలోమీటర్లు వేగంతో దూసుకుపోనున్నది.

కొటక్ బ్యాంక్ లాభం 4,701 కోట్లు

ముంబై, జనవరి 18: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సేవల సంస్థ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,701 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,265 కోట్ల లాభంతో పోలిస్తే 10.22 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.14,096 కోట్ల నుంచి రూ.16,050 కోట్లకు చేరుకున్నట్లు, అలాగే నిర్వహణ ఖర్చులు కూడా రూ.9,530 కోట్ల నుంచి రూ.10,869 కోట్లకు ఎగబాకాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ స్వల్పంగా పెరిగి 1.49 శాతం నుంచి 1.50 శాతానికి చేరుకున్నాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.794 కోట్ల నిధులను వెచ్చించింది. క్రితం ఏడాది కేటాయించిన రూ.660 కోట్లతో పోలిస్తే భారీగా పెరిగాయి.

రెండోరోజూ ఈవీల జోరు

విన్‌ఫాస్ట్ ప్రీమియం ఈవీ కార్లు

సోలార్‌తో నడిచే ఈవీ

సరికొత్త మాడళ్లను ప్రదర్శించిన ఆటోమొబైల్ సంస్థలు

న్యూఢిల్లీ, జనవరి 18: దేశీయ ఆటోమొబైల్ ఎక్స్‌పోలో ఈవీల జోరు కొనసాగుతున్నది. వరుసగా రెండో రోజు శనివారం కూడా ప్రధాన ఆటోమొబైల్ సంస్థలతోపాటు చిన్న స్థాయి సంస్థలు కూడా పలు ఈవీలను ప్రదర్శించాయి. ఈసారి జరుగుతున్న ఆటోమొబైల్ ఎక్స్‌పోలో ఈవీలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చాయి కంపెనీలు. సోలార్‌తో నడిచే ఈవీతోపాటు ప్రీమియం ఈవీ కార్లు, కమర్షియల్ వాహనాలు, ట్రక్కులు, స్కూటర్లు, చిన్న స్థాయి కమర్షియల్ వాహనాలతో ఆటోమొబైల్ ఎగ్జిబిషన్ కళకళలాడింది.

సోలార్‌తో నడిచే ఈవీ

ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. తాజాగా సోలార్‌తో నడిచే ఎలక్ట్రిక్ వాహనాన్ని దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది వావే మొబిలిటీ. ఈవా పేరుతో విడుదల చేసిన ఈ కారు రూ.3.25 లక్షలు మొదలుకొని రూ.6 లక్షల గరిష్ఠ ధరతో లభించనున్నది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా కంపెనీ సీవోవో విలాస్ దేశ్‌పాండే మాట్లాడుతూ..సోలార్‌తో నడిచే ఈ వాహనానికి దేశీయంగా డిమాండ్ ఉంటుందని ఆశిస్తున్నట్లు, వచ్చే ఏడాది మధ్య నుంచి కమర్షియల్ ఉత్పత్తిని ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఈ వాహనాన్ని బుకింగ్ చేసుకున్న కస్టమర్లు ఇంచుమించు రెండేండ్లు వేచిచూడాల్సి ఉంటుంది. వచ్చే ఏడాది చివరి నుంచి డెలివరీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ వాహనాలు కేవలం పుణె, బెంగళూరు నగరాల్లో మాత్రమే విక్రయించనున్నట్లు చెప్పారు. మూడు రకాల్లో నివా, స్టెల్లా, వెగా పేర్లతో లభించనున్న ఈ కారు ఈ నెల చివరి నుంచి ముందస్తు బుకింగ్‌లు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఒలెక్ట్రా బ్లేడ్ బ్యాటరీ ఈ-బస్సు

విన్‌ఫాస్ట్ ప్రీమియం ఈవీ కార్లు

వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ విన్‌ఫాస్ట్ ఆటో..దేశీయ మార్కెట్లోకి రెండు ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. ఈ ఏడాది చివర్లో అందుబాటులోకి రానున్న వీఎఫ్ 7, వీఎఫ్ 6 మాడళ్లు కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా డిజైన్ చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్లను తయారు చేయడానికి తమిళనాడులో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడితో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు విన్‌ఫాస్ట్ ఆసియా సీఈవో ఫామ్ సన్హా చౌ తెలిపారు. ఈ ఏడాది చివరినాటికి అందుబాటులోకి రానున్న ఈ ప్లాంట్‌తోపాటు కార్లను కూడా ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

మోంత్రా ఎలక్ట్రిక్ కమర్షియల్ వాహనాలు

దేశీయ మార్కెట్లోకి ఎలక్ట్రిక్ చిన్న కమర్షియల్ వాహనాలతోపాటు మూడు చక్రాల వాహనాలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది మోంత్రా ఎలక్ట్రిక్. 3.5 టన్నుల సరుకును తీసుకెళ్లే ఈ ఎవియేటర్ కమర్షియల్ వాహనాన్ని ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించింది. కేవలం 15 నిమిషాల్లోనే పూర్తిగా రీచార్జికానున్న ఈ మూడు చక్రాల వాహనం వ్యక్తిగత వ్యవస్థాపకులకోసం తీర్చిదిద్దినట్లు వెల్లడించింది.

న్యూమరస్ ఈ-స్కూటర్

బెంగళూరుకు చెందిన ఈవీ స్కూటర్ల తయారీ సంస్థ న్యూమరస్ మోటర్స్..దేశీయ మార్కెట్లోకి రూ.1.09 లక్షల విలువైన ఈ-స్కూటర్ డిప్లాస్ మ్యాక్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సింగిల్ చార్జింగ్‌తో 140 కిలోమీటర్లు ప్రయాణించే ఈ స్కూటర్ గంటకు 63 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోనున్నది. 3 నుంచి 4 గంటలలోపే బ్యాటరీ పూర్తిస్థాయిలో రీచార్జికానున్నది. ప్రస్తుతం 14 నగరాల్లో మాత్రమే వాహనాలను విక్రయిస్తుండగా, వచ్చే ఆర్థిక సంవత్సరం చివరినాటికి వీటి సంఖ్యను 170కి పెంచుకోనున్నట్లు ప్రకటించింది.

ఎకా ఎలక్ట్రిక్ ట్రక్కు

విద్యుత్‌తో నడిచే కమర్షియల్ వాహన తయారీ సంస్థ ఎకా మొబిలిటీ..తాజాగా ఎలక్ట్రిక్ ట్రక్కు, ఆరుగురు కూర్చోవడానికి వీలుండే రవాణా వాహనాన్ని సైతం ఆవిష్కరించింది. ఎకా 55టీ పేరుతో పిలిచే ఈ ఎలక్ట్రిక్ హెవీ-డ్యూటీ ట్రక్కు సింగిల్ చార్జింగ్‌తో 200 కిలోమీటర్లు, 43 వేల కిలోల లోడ్ కెపాసిటీ, ఫాస్ట్-చార్జింగ్ సదుపాయంతో తయారు చేసింది. దేశీయ ఆటోమొబైల్ రంగంపై తమకున్న కమిట్‌మెంట్‌కు ఈ నూతన వాహనాలు నిదర్శనమని, తాజాగా ఎలక్ట్రిక్ బస్సులు, ట్రక్కులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

ఈపీఎఫ్ సేవలు సరళతరం

- **ఇక సులభంగా ఆన్‌లైన్‌లో ఉద్యోగుల వ్యక్తిగత వివరాలను సవరించుకునే అవకాశం**

న్యూఢిల్లీ, జనవరి 18: పీఎఫ్ చందాదారులకు ఉద్యోగ భవిష్యనిధి సంస్థ ఈపీఎఫ్‌వో శుభవార్తను అందించింది. పీఎఫ్ చందాదారులు తమ పేర్లను, పుట్టిన తేదీ తదితర వివరాలను మార్చుకోవడాన్ని మరింత సులభతరం చేసింది. ఇకపై యజమాని, ఈపీఎఫ్‌వో ఆమోదం అవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో సులువుగా మార్చుకునే వీలు కల్పించింది. ఈ-కేవైసీ పూర్తి చేసిన ఈపీఎఫ్ ఖాతాలను యజమాని జోక్యం లేకుండానే ట్రాన్స్‌ఫర్ చేసుకునే మరో సదుపాయాన్ని శనివారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నూతన సేవలను కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయా ప్రారంభించారు. ఈపీఎఫ్‌వో చందాదారులకు సంబంధించి వ్యక్తిగత వివరాలు పేరు, పుట్టిన తేదీ, తండ్రి/తల్లి పేరు, వైవాహిక స్థితి, జీవిత భాగస్వామి పేరు, ఉద్యోగంలో చేరిన తేదీ, ఉద్యోగం వీడిన తేదీ వంటి వివరాలు ఇక నుంచి సులభంగా మార్చుకోవచ్చును. 2017 అక్టోబర్ 1 తర్వాత జారీ అయిన ఈపీఎఫ్‌వో చందాదారులు ఈ కొత్త సదుపాయాన్ని వినియోగించుకోవచ్చును. ఇందుకోసం ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించాల్సిన అవసరం లేదు. అలాగే అంతకుముందు ఉన్న చందాదారులు ఈపీఎఫ్ ఆమోదం అవసరం లేకుండానే యాజమాన్యమే అవసరమైన మార్పులు చేసుకునే వెసులుబాటు ఉన్నది. ఇందుకు అవసరమైన డాక్యుమెంట్లను కూడా తగ్గించినట్లు పేర్కొంది. ఈపీఎఫ్‌వో చందాదారుల్లో 27 శాతం మంది ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటిని సులభతరంగా వ్యక్తిగత వివరాలు సవరించుకోవాలనే ఉద్దేశంతో ఈ నూతన సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మాండవీయా తెలిపారు. ఉద్యోగులు తమ పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, ఈ సమయంలోనూ ఈపీఎఫ్‌లో మార్పులు చేయడానికి ఆఫీసుల చుట్టు తిరగాల్సి వస్తున్నదని, ఈ భారం నుంచి తగ్గించాలని వచ్చిన విజ్ఞప్తులతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. మరోవైపు, ఆధార్‌తో లింక్ చేయని పీఎఫ్ ఖాతాల్లో మార్పులు చేయాలంటే డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8 లక్షలకు పైగా రిక్వెస్ట్‌లు వచ్చాయని, వీటిలో 40 శాతం సమస్యలను ఐదు రోజుల్లో పరిశీలించగా, 47 శాతం రిక్వెస్ట్‌లు 10 రోజుల్లో పూర్తైనట్లు తెలిపారు. ఈ తాజా నిర్ణయంతో 45 శాతం మందికి తక్షణమే ఊరట లభించనుండగా, మరో 50 శాతం కరెక్షన్లు యజమాని దగ్గర పరిష్కారం కానున్నాయి.

బడ్జెట్‌లో కొత్త ఆదాయ పన్ను చట్టం?

న్యూఢిల్లీ, జనవరి 18: నరేంద్ర మోదీ సర్కార్ మరో విప్లవాత్మక చర్యలకు శ్రీకారం చుట్టబోతున్నదా.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. ఆరు దశాబ్దాల క్రితం రూపొందించిన ఆదాయపు పన్ను చట్టాన్ని మార్చే దిశగా చర్యలకు ఉపక్రమించినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఇందుకు సంబంధించి వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టేయోచనలో కేంద్రం ఉన్నట్లు తెలుస్తున్నది. రెండో విడత సమావేశాల్లో ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈసారి బడ్జెట్ సెషన్‌లో కొత్త ఆదాయపు పన్నుకు సంబంధించి బిల్లును ప్రవేశపెడుతాం. ఇది పూర్తిగా కొత్త చట్టం. ప్రస్తుతం ఉన్న చట్టాన్ని సవరించేయోచన లేదు. ప్రస్తుతం ఇందుకు సంబంధించి ముసాయిదాను న్యాయమంత్రిత్వ శాఖ పరిశీలిస్తున్నదని అధికారులు వెల్లడించారు. ఈ నూతన ఆదాయ పన్ను చట్టం, 1961ని గడిచిన ఆరు నెలలుగా సమీక్షించి చివరకు పాత చట్టాన్ని మరింత సులభతరం చేస్తూ, నిబంధనలు అందరికీ అర్థమయ్యేలా ఈ కొత్త చట్టాన్ని తెస్తున్నారు. ఈ చట్టం ప్రకారం పేజీలను 60 శాతం తగ్గనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్..2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను సార్వత్రిక బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోతున్నారు. ఇందుకు సంబంధించి 6,500 మంది సూచనలు ఆధారంగా ఈ నూతన చట్టాన్ని రూపొందించినట్లు చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.